

సీఎం ప్రజావాణిలో మంగళవారం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి

- బేగంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)

● శుభాకాంక్షలు



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మంగళవారం ఆయన నివాసంలో కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తున్న సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

- బేగంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయాలి

అడ్డగుట్ట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నవంబరు 23న జరిగే మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య కోరారు. లాలాపేట వినోభానగర్‌కు వచ్చిన ఆయనకు మాలమహానాడు నాయకుడు బండి మహేశ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. దీపావళి పండుగను పురస్కరించుకుని మాలల శ్మశానవాటికలో పూర్వీకుల సమాధుల వద్ద జరుగుతున్న పూజల్లో బస్తీవాసులతో కలిసి ఆయన పాల్గొన్నారు. 150 సంవత్సరాలుగా మాలల శ్మశానవాటికను కబ్జా చేయడానికి కొందరు యత్నిస్తూ, అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. శ్మశానవాటికను కాపాడాలని ఆయనను బస్తీవాసులు కోరారు. అనంతరం రణభేరి మహాసభ పోస్టర్లను చెన్నయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాలమహానాడురాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జైకుమార్, సికింద్రాబాద్ అధ్యక్షుడు నేతల రమేశ్, నాయకులు రమాదేవి, పుష్ప, పద్మ, సత్యనారాయణ, రామచందర్, మల్లేష్, శ్రీనివాస్, బాలకృష్ణ, నవీన్, శేఖర్, సత్యనారాయణ, లక్ష్మణ్, కరుణా, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్వెల పండుగ

అమీర్‌పేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను సోమవారం ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఇళ్లల్లో, వ్యాపార సముదాయాల్లో భక్తిశ్రద్ధలతో లక్ష్మి పూజలు నిర్వహించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని అమీర్‌పేటలోని హనుమాన్, కనకదుర్గా, బల్కంపేటలోని ఎల్లమ్మ, వీరాంజనేయ షిరిడీ సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుందర్‌నగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి మహిళా నాయకులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు.



దీపావళి వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ శేషుకుమారి

● సదర్ సంబరం



ఖైరతాబాద్ సదర్ సంబరాల్లో మానుక కుటుంబ సభ్యులు, స్థానికులు

వరద బాధితులకు డ్రై కిట్స్ పంపిణీ

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇబ్బంది పడిన వరద బాధితులకు డీబీఆర్సీ ఆధ్వర్యంలో డ్రైకిట్స్ పంపిణీ చేశారు. మంగళవారం వారాసిగూడ బ్రాహ్మణబస్తీలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్సీ) ఆధ్వర్యంలో ఎనిమిది మంది కుటుంబాలకు డ్రై కిట్స్‌తో పాటు వివిధ రకాల వస్తువులను అందజేసినట్లు డీబీఆర్సీ సమన్వయ కర్త నళిని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ హైదరాబాద్ జిల్లా కమిటీ సభ్యురాలు కల్పన, డీబీఎఫ్ శంకర్ పాల్గొన్నారు.



- బౌద్ధనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)

జూబ్లీహిల్స్‌లో ప్రచార హోరు!

ఇంటింటి ప్రచారంలో నేతలు బిజీ

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రచారం జోరందుకుంది. మంగళవారంతో ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసింది. కొందరు నామినేషన్ వేసే పనిలో బిజీగా ఉండగా.. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ మాత్రం పలు కాలనీల్లో ప్రచారం నిర్వహించాయి. ఆయా పార్టీల అభ్యర్థులతో పాటు మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ఇతర నాయకులు ప్రచారంలో పాల్గొని తమ పార్టీ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.



కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌తో కలిసి మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి: మంత్రి వివేక్‌వెంకటస్వామి

బోరబండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ సమగ్రాభివృద్ధి కోరుకునే వారు ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఓటర్లను కోరారు. ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్, రాజీవ్‌గాంధీ నగర్, ఆరోగ్యనగర్ బస్తీలలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌తో కలిసి ఆయన ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల సక్రమ అమలుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ఉబేదుల్లా కొత్వాల్, మల్‌రెడ్డి రామిరెడ్డి, జైపాల్, ఏఐసీసీ కో ఆర్డినేటర్ డా.రవిశేఖర్‌రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, పార్టీ నగర ప్రధాన కార్యదర్శి భవానీశంకర్, నాగేశ్‌నాయక్, నాగరాజు, జాఫర్, జ్ఞానేశ్వర్, అండాలు, మేఘన పద్మ, శివ, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బోరబండ వినాయకరావు నగర్‌లో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, కార్పొరేటర్ ఎండీ బాబా ఫసియుద్దీన్ తో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపఎన్నికలో నవీన్‌యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని నియోజకవర్గ ప్రజలను ఆమె కోరారు.

- బోరబండ, (ఆంధ్రజ్యోతి)



చిరు వ్యాపారులను ఓటు అడుగుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి సునీత, కుమారుడు వాత్సల్యనాథ్

గోపీనాథ్ ఆశయ సాధనకు కృషి చేస్తా

● బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత

యూసూఫ్‌గూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ గోపీనాథ్ ఆశయ సాధనకు కృషి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత అన్నారు. మంగళవారం యూసూఫ్‌గూడ, వెంగళరావు నగర్ డివిజన్‌లోని పలు బస్తీల్లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూరగాయల మార్కెట్‌లో చిరువ్యాపారులను కలసి ఓటు అడిగారు. అనంతరం సునీత మాట్లాడుతూ, మహిళల అభివృద్ధి, మైనారిటీల సంక్షేమానికి గోపీనాథ్ ఎంతో కృషి చేశారన్నారు. ప్రచారంలో ప్రజలు తమపై చూపిస్తున్న ఆదరణను మరువలేమని అన్నారు. సునీత వెంట కుమారుడు వాత్సల్యనాథ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



బోరబండ డివిజన్ వినాయకరావునగర్ బస్తీలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ తరపున ఎన్నికల ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి

- బోరబండ, (ఆంధ్రజ్యోతి)

నామినేషన్లు

గుర్రం బగ్గిపై శాలివాహన చక్రవర్తి వేషధారణలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి బయలుదేరిన డా.వీరభోగ వసంత రాముల ప్రజాపతి.

- యూసూఫ్‌గూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)





తెలంగాణ ఉద్యమకారుల తరపున జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో మంగళవారం నామినేషన్ వేయడానికి వెళ్తున్న ఇంద్రకుమార్

- యూసూఫ్‌గూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

● హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

● యూసుఫ్‌గూడ బస్తీ దవాఖానా సందర్శన

యూసూఫ్‌గూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బస్తీ దవాఖానాలను నిర్లక్ష్యం చేస్తోందని, మూడు నెలలుగా డాక్టర్లకు, ఆరు నెలలుగా సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా మంగళవారం రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీతతో కలిసి యూసూఫ్‌గూడ బస్తీ దవాఖానను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బస్తీ దవాఖానకు వచ్చిన రోగులకు కాలం చెల్లడానికి దగ్గరికి వచ్చిన మందులను ఇస్తున్నారని ఆరోపించారు. రోగులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన ఆరోపించారు. అనంతరం అంబేద్కర్‌నగర్, యూసూఫ్‌గూడ బస్తీలలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. అదే విధంగా ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సోమాజిగూడ అంబేద్కర్‌నగర్‌లో ఎమ్మెల్సీలు నవీన్‌రెడ్డి, రమణ, రహమత్‌నగర్ ప్రతిభానగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, వెంగళరావునగర్, జవహర్‌నగర్‌లో ఎమ్మెల్యే డా.సంజయ్, మాజీ ఎమ్మెల్యే డా.ఆనంద్‌లు ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటేసి మాగంటి సునీతను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.



బస్తీ దవాఖానాలో రోగులకు అందజేస్తున్న మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎంపీ రవిచంద్ర, అభ్యర్థి మాగంటి సునీత

పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

● సీఐ శ్రీనాథ్‌రెడ్డి

అమీర్‌పేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని సీఐ శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎస్ఆర్‌నగర్ పోలీసులు అమరులకు నివాళులర్పించారు. అదే విధంగా ఎస్ఆర్‌నగర్‌లోని ఉమేశ్‌చంద్ర విగ్రహం వద్ద ఆయన తల్లిదండ్రులు వేణుగోపాల్ రావు, నయనతారతో కలిసి సీఐ నివాళులర్పించారు. అనంతరం సీఐ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రాణాలను సైతం పణంగా పెట్టిన వ్యక్తి ఉమేష్‌చంద్ర అని కొనియాడారు. పోలీసు ఉద్యోగం కత్తిమీది సాములాంటిదన్నారు. పోలీసు అమరులు భౌతికంగా లేకపోయినప్పటికి వారి ఆశయాలు కళ్ల ముందే కదలాడుతున్నాయన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని విధులు నిర్వహిస్తామని శ్రీనాథ్‌రెడ్డి వెల్లడించారు.



ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద ఆయన తల్లిదండ్రులతో కలిసి నివాళులర్పిస్తున్న సీఐ శ్రీనాథ్‌రెడ్డి

నేడు అర్వింద్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

సికింద్రాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారిగా అర్వింద్‌కుమార్ ద్వివేదీ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మూడేళ్లుగా కంటోన్మెంట్ సీఈఓగా ఉన్న మధుకర్ నాయక్‌ను ఇటీవల న్యూఢిల్లీలోని రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయానికి పదోన్నతిపై బదిలీ చేయడం, అక్కడ ఉన్న అర్వింద్‌కుమార్‌ను కంటోన్మెంట్ సీఈఓగా బదిలీ చేయడం తెలిసిందే. కాగా మధుకర్‌నాయక్ నుంచి బుధవారం ద్వివేదీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

● పదోన్నతితో బదిలీపై వెళుతున్న కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహనాధికారి డి.మధుకర్ నాయక్ సేవలను ప్రజలు మరువలేరని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో మధుకర్ నాయక్‌తోపాటు నూతన సీఈఓగా బాధ్యతలు స్వీకరించనున్న అర్వింద్‌కుమార్ ద్వివేదీ, డిఫెన్స్ ఎస్టేట్‌అధికారి దినేష్ రెడ్డిలను ఆయన కలిశారు. నూతన సీఈఓ ద్వివేదీకి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

హైటెక్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మాదాపూర్‌లో జరిగింది. ఎస్ఐ నారాయణసింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా ఎనమాదూర్ గ్రామానికి చెందిన చిత్తజల్లు సాయినాథ్(32) మాదాపూర్‌లో ఎన్ కన్వెన్షన్ సమీపంలోని వైఎస్ఆర్ కనస్ట్రక్షన్ అపార్టుమెంట్‌లో మేస్త్రీగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో వాటర్ తెచ్చుకునేందుకు మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి నడిచి వెళ్తున్నాడు. జేఎన్టీయూ రోడ్డులోని కిరాణాషాపు వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన టీఎస్ 08 యూహెచ్ 2472 నంబరు గల కారు సాయినాథ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయినాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు కొండాపూర్‌లోని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ కాకరపర్తి సత్యమణికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణసింగ్ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

ఖైరతాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నమాజ్ చేసి వస్తానని చెప్పి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ సమీర్ తెలిపిన వివరాల ప్రకారం. మహమ్మద్ సుల్తాన్ (76) అనే వృద్ధుడికి ఇద్దరు కొడుకులు అయాజ్, సిరాజ్. చింతలబస్తీలో ఉంటున్న పెద్ద కొడుకు అయాజ్ వద్ద ఉన్న సుల్తాన్ ఈ నెల 4న నమాజ్ చేసి వస్తానని కోడలికి చెప్పి మధ్యాహ్నం వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికారు. అయినా అతని ఆచూకీ తెలియకపోవడంతో ఈ నెల 18న అయాజ్ ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు మంగళవారం తెలిపారు. తప్పిపోయిన ఆచూకీ తెలిసిన వారు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌కు, లేదా 8712541537కు సమాచారం అందించాలని ఎస్ఐ సమీర్ తెలిపారు.



మహమ్మద్ సుల్తాన్

జూదం ఆడుతున్న 16 మంది అరెస్ట్

పంజాగుట్ట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అపార్టుమెంట్ టెర్రస్‌పై జూదం ఆడుతున్న 16 మందిని పంజాగుట్ట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 12,330 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. ఎల్లారెడ్డిగూడలోని శ్రీరామ ఎన్‌క్లేవ్‌లో టెర్రస్ పైన చిరువ్యాపారులు 16 మంది జూదం ఆడుతున్నారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై గేమింగ్ చట్టం సెక్షన్ 9(1) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పంజాగుట్ట పోలీసులు తెలిపారు.

యువతి ప్రాణాలు కాపాడిన లేక్ పోలీసులు

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యకు ప్రయత్నించిన యువతిని మంగళవారం లేక్ పోలీసులు కాపాడారు. లేక్ ఇన్‌స్పెక్టర్ బుర్ర చిట్టి తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణగూడలో ఇంటర్ చదువుతున్న 16 సంవత్సరాల యువతి చదువుపై శ్రద్ధలేక చదువుకోలేకపోతుంది. దీనితో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం బోట్స్ క్లబ్ వద్ద ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. దీనిని గమనించిన అటుగా వెళుతున్న వారు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే కానిస్టేబుళ్లు సందీప్, లావణ్యలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బాధిత యువతిని కాపాడారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. యువతికి ఇన్‌స్పెక్టర్ విద్య, జీవితంపై అవగాహన కల్పిస్తూ మానసికంగా దృఢంగా ఉండాలని కౌన్సెలింగ్ ఇచ్చి తల్లికి అప్పగించారు.



బాధితురాలికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

● గచ్చిబౌలి ఏడీఈ శివప్రసాద్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాబాటలో తమ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరిస్తామని గచ్చిబౌలి ఏడీఈ శివప్రసాద్ అన్నారు. విద్యుత్ శాఖ నిర్వహిస్తున్న ప్రజాబాటలో భాగంగా మంగళవారం గచ్చిబౌలి సెక్షన్ అంజయ్యనగర్‌లో ఏఈ భాస్కర్, సిబ్బందితో కలిసి పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను కాలనీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటునట్లు తెలిపారు. ప్రాధాన్యతను బట్టి ఎయిర్‌బంచుడ్ కేబుల్ (ఏబీ) అందుబాటులోకి తీసుకువస్తునట్లు వెల్లడించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ప్రజాబాట కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఏడీఈ శివప్రసాద్ తెలిపారు.



అంజయ్యనగర్‌లో పర్యటిస్తున్న ఏడీఈ శివప్రసాద్ తదితరులు

నిరుపయోగంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి

● మూడేళ్ల క్రితం పూర్తి చేసుకున్న నిర్మాణం

● అన్ని హంగులతో నిర్మించి విద్యుత్ కనెక్షన్ ఇవ్వని అధికారులు

● షేక్‌పేట్ బ్రిడ్జి ముగింపు కావడంతో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ

● రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్న పాదచారులు

రాయదుర్గం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి మల్కంచెరువు వద్ద వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని జీహెచ్ఎంసీ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించింది. మెట్లు, లిఫ్ట్, ఎస్కలేటర్ వంటి అన్ని సౌకర్యాలతో నిర్మాణం పూర్తి చేసి మూడేళ్లు అవుతున్నా.. నేటికీ ప్రారంభం కాలేదు. అన్ని వసతులు ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా, ప్రారంభించకుండా వదిలేశారు. దీంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన బ్రిడ్జి నిరుపయోగంగా మారింది. ఈ ప్రాంతంలో ఉదయం నుంచి రాత్రి వరకు విపరీతమైన వాహనాల రద్దీ ఉంటుంది. దీనికి తోడు షేక్‌పేట్ ఫ్లైఓవర్ ముగింపు కావడంతో వేగంగా దూసుకువచ్చే వాహనాలతో ప్రజలు రోడ్డు దాటాలంటే భయాందోళనకు గురవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డుదాటుతూ ప్రజలు ప్రాణాలు కోల్పోయిన, గాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. కొంతమంది రోడ్డు దాటే క్రమంలో గందరగోళానికి గురవుతూ ద్విచక్రవాహనాలకు, కార్లకు అడ్డుపడుతున్నారు. ఇంత జరుగుతున్నా నిర్మాణం పూర్తి చేసుకున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించాలన్న ఆలోచన అధికారులకు రావడం లేదని పాదచారులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జిని ప్రారంభించాలని కోరుతున్నారు.



నిర్మాణం పూర్తి చేసుకున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి





నిరుపయోగంగా ఉన్న ఎస్కలేటర్, లిఫ్ట్

బ్రిడ్జిని ప్రారంభించాలి

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించకుండా వదిలేశారు. ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో రోడ్డు దాటడానికి నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు రోడ్డు దాటాలంటే కష్టతరంగా మారింది. రోడ్డు దాటుతున్నప్పుడు జరుగుతున్న ప్రమాదాలను చూస్తుంటే భయంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించాలి.

- పరమానందం, స్థానికుడు

ఇలా ఎందుకు వదిలేశారు?

బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి ఇలా నిరుపయోగంగా ఎందుకు వదిలేశారో అర్థం కావడం లేదు. ఇక్కడ రోడ్డు దాటేందుకు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది రోడ్డు దాటే సమయంలో అడ్డుపడుతుండంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడిపోతున్నారు. దీంతో వారికి గాయాలు కావడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది.

- సతీష్, వాహనదారుడు



బస్తీ దవాఖానాలో రికార్డులు తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ

బస్తీ దవాఖానాను తనిఖీ చేసిన కార్పొరేటర్

బౌద్ధనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌కాలనీలో ఉన్న బస్తీ దవాఖానాను స్థానిక కార్పొరేటర్ సామల హేమ తనిఖీ చేశారు. సేవలు, నాణ్యత, మందుల సరఫరా, పారిశుధ్యంతో పాటు ఆరోగ్య సదుపాయాలపై మెడికల్ ఆఫీసర్ సృజలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రికార్డులను తనిఖీలు చేశారు. బస్తీ దవాఖానలను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ రమ్య, నాయకులు శైలేందర్, మిట్టపల్లి బాబురావు, రవీంద్రసాగర్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో జరుగుతున్న మరమ్మతు పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. సుమారు ఇరవైలక్షల రూపాయల వ్యయంతో ఈ పనులను చేపట్టినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, డీఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో అన్నదానం

తిరుమలగిరి అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అమావాస్యను పురస్కరించుకుని అమావాస్య అన్నదానం కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం లాల్‌బజార్‌లోని మహంకాళి దేవాలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, కుంకుమార్చన, పుష్పార్చన లాంటి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు ప్యారసాని శ్యామ్ కుమార్, భాగ్యశ్రీ ఆధ్వర్యంలో అమ్మవారి భక్తుడు యశ్వంత్ కుమార్ పర్యవేక్షణలో దాతల సహకారంతో అన్నదానం చేశారు. ప్యారసాని రాజు, రాజారెడ్డి, ఉమేష్, వేణుగోపాల్, ఆర్కే రామ్, వినోద్, నరేందర్, అనురాధ రెడ్డి, శ్రీను, పద్మావతిలు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న మాజీ బోర్డు సభ్యురాలు భాగ్యశ్రీ

వారాసిగూడ చౌరస్తాలో..

బౌద్ధనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం వారాసిగూడ చౌరస్తాలో వారాసిగూడ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతలు ఎలకంటి శివకుమార్, నాగేశ్వరరావు, ఆర్.సత్యనారాయణ సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాతలను వారు సత్కారించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కురాకుల సుధాకర్, ప్రధాన కార్యదర్శి బి.రాజేశ్‌గుప్తా, కోశాధికారి ఎం.వీరశేఖర్, ప్రాజెక్ట్ చైర్మన్ వెంకటేశ్ పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య ప్రతినిధులు



లాలాపేట్..

దీపావళి అమావాస్యను పురస్కరించుకుని లాలాపేట్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం లాలాపేట్‌లోని బస్‌స్టాప్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు నేతి రాములు, అధ్యక్షుడు మడిపడిగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పందిరి సాంబశివరావు, కోశాధికారి యెనిశెట్టి భాస్కర్, గంప నగేష్, నెలుగునూరు శ్రీనివాస్, ప్రభాకర్, శ్రీకాంత్, రాచర్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి

సఫాయి కార్మికులకు సత్కారం

తిరుమలగిరి అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సఫాయి అన్న నీకు సలాం, సమాజానికి మీరు చేసే సేవలు మరువలేనివి అంటూ దీపావళిని పురస్కరించుకుని సోమవారం బొల్లారం రిసాలాబజార్ లోని డాక్టర్ అంబేడ్కర్ సామాజిక భవనంలో సఫాయి కార్మికులు, కార్మికురాళ్లను బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారి సేవలు గుర్తించి శాలువా కప్పి, స్వీట్స్ అందజేసి సత్కరించారు. కరోనా మహమ్మారిని లెక్కచేయకుండా వీధి వాడలను శుభ్రం చేశారని గుర్తు చేశారు. సిపాయిలు దేశానికి రక్షణగా ఉంటే ఆరోగ్యవంతమైన సమాజానికి నిర్మాణంలో సఫాయి కార్మికులు ముందు వరుసలో ఉన్నారన్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఖదీరవన్, మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, రామ్, అంబేడ్కర్ అసోసియేషన్ సభ్యులు ఉదయ్, ఉమేష్, చిన్నా, సానిటరీ ఇన్‌స్పెక్టర్ అమిత్, దఫేదార్ రాములు, కేజీ రవికుమార్, చందు, రవి, బాలరాజ్ ఉన్నారు.

నిరాశ్రయులతో స్కై దీపావళి వేడుకలు

పద్మారావునగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్‌లోని స్కై ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వై.సంజీవకుమార్, సంస్థ సభ్యులు దీపావళి పండుగను పురస్కరించుకొని సోమవారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై నివసిస్తున్న అనాథలు, అభాగ్యులు, వికలాంగులు, నిరాశ్రయులతో కలసి దీపావళి వేడుకలను నిర్వహించారు. వారితో కలసి దీపాలను వెలిగించి అనంతరం పాయసం, పండ్లను అందించారు. సంస్థ ఉపాధ్యక్షురాలు పావని, సభ్యులు పాల్గొన్నారు.

గిట్టుబాటు రాక రోడ్డుపై పడేసిన బంతిపూలు

బోయినపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఫ్లవర్ మార్కెట్‌లో వారం రోజుల క్రితం కిలో రూ.100 నుంచి రూ.130 ధర పలికిన బంతిపూల ధరలు మళ్లీ పాతాళానికి దిగజారాయి. అయితే దీపావళి సందర్భంగా శనివారం, ఆదివారం మార్కెట్‌కు తీసుకువచ్చిన బంతిపూలకు సరైన ధరలు లభించక రైతులు వాటిని రోడ్డు పక్కనే పడవేసి వెళ్లారు. మార్కెట్‌కు తరలించడానికి అయ్యే ఖర్చులు కూడా మిగలడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా అక్టోబర్ నెలలో పెద్ద ప్రమాణంలో పూలు కోతకు రావడంతో డిమాండ్ తగ్గి ధరలు భారీగా తగ్గాయని వ్యాపారులు అంటున్నారు.

చిలకలగూడలో ట్రాఫికర్!

ఆరు రోడ్ల కూడలి... ఒక ప్రక్క వివిధ ప్రాంతాలకి వెళ్లే బస్సులు.. మరో ప్రక్క రైల్వే స్టేషన్‌కి వెళ్లే ప్రయాణీకులు.. మరో ప్రక్క షేరింగ్ ఆటోల అడ్డా.. గాంధీ ఆసుపత్రికి, రైల్వే స్టేషన్‌కి వెళ్లే ప్రయాణీకులకి ఇబ్బందులు..చిన్నపాటి వర్షానికే.ఓలిఫెంటా బ్రిడ్జి వద్ద నీరు నిలిచి ఇబ్బందులు

గాంధీకి, రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే నరకమే

షేరింగ్ ఆటోల అడ్డాగా..ప్రయాణికులకు ఇబ్బందులు





చిలకలగూడ చౌరస్తాలో ట్రాఫిక్

చిలకలగూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది వాహన, పాదచారులతో అత్యంత రద్దీగా వుండే చౌరస్తా చిలకలగూడ చౌరస్తా. ఈ చౌరస్తా గుండా ముషీరాబాద్, బోయిగూడ ప్లాట్‌ఫాం నంబర్ 10, సంగీత్, సీతాఫల్‌మండి, రైల్వేక్వార్టర్స్‌కు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడే ఉప్పల్, ఘటకేసర్, తదితర ప్రాంతాలకు వెళ్లే బస్టాపు. మరోపక్క సీతాఫల్‌మండి, వారాసిగూడ తదితర ప్రాంతాలకు వెళ్లే షేరింగ్ ఆటోల అడ్డా. అలాగే గాంధీ ఆస్పత్రి, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కి వెళ్లే ప్రయాణీకులతో రద్దీగా ఉంటుంది. మరోపక్క సంగీత్, ప్యారడైజ్ వైపునకు వెళ్లే వారు, సెంట్ ఆన్స్ స్కూల్స్, కీస్, సెంట్ జాన్స్ స్కూల్స్‌తో పాటు వివిధ రైల్వే కార్యాలయాలు ఉన్నాయి. వెరసి ఈ ప్రాంతంలో ఉదయం, సాయంత్రం వేళల్లో తరచూ భారీగా ట్రాఫిక్‌జామ్ అవుతుంది. దీంతో రైలు ప్రయాణీకులకు ఎక్కాల్సిన రైళ్లు తప్పిపోతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో గాంధీ ఆస్పత్రికి వెళ్లే రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. అదే విధంగా పల్లపు ప్రాంతం కావడంతో చిన్నపాటి వర్షానికే ఓలిఫెంటా బ్రిడ్జి వద్ద నీరు నిలిచి ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయి. ఆరురోడ్ల కూడలి కావడంతో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుచేసినా ఫలితాలు రాలేదు. ఆలుగడ్డ బావి నుంచి ముషీరాబాద్ వరకు చిన్నపాటి ఫ్లైఓవర్ నిర్మిస్తే ఈ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించవచ్చని పలువురు సూచిస్తున్నారు. ఓలిఫెంటా బ్రిడ్జి వద్ద నీరు నిలువకుండా, ఆర్టీసి బస్సులు, షేరింగ్ ఆటోల ఇష్టారాజ్యంగా నిలుపుదల వంటివి నియంత్రిస్తే ట్రాఫిక్ సమస్యకు కొంతవరకు పరిష్కారం లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

రోడ్ల నిర్మాణం అనుకూలంగా లేకపోవడంతో గతంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా సత్ఫలితాలు ఇవ్వలేదు. ఉదయం సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ ఎక్కువగా వుంటుంది. ట్రాఫిక్ నియంత్రణకి ప్రతి రోజు ముగ్గురు కానిస్టేబుల్స్‌ని నియమించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం.

- భాస్కర్, ట్రాఫిక్ ఎస్ఐ

రైల్వే స్టేషన్ చేరుకోవడానికి ఇబ్బందులు



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కి సకాలంలో చేరుకోలేకపోతున్నాం. ట్రాఫిక్ జాంలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్టేషన్ చేరుకోవడానికి తక్కువ దూరమైనా అనుకున్న సమయానికి చేరుకోలేకపోతున్నాం. ఒకటి రెండుసార్లు ట్రైన్ మిస్‌అయ్యాను

- జె.వి.యల్. ప్రసాద్, మల్కాజిగిరి వాసి

బస్సుల రాకపోకలతో ఇబ్బందులు



ఉప్పల్, ఘటకేసర్, దిల్‌సుక్‌నగర్ తదితర ప్రాంతాలకి ఆర్టీసి బస్సులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. ఇష్టారాజ్యంగా బస్సులు నిలపడంతో ట్రాఫిక్ జామ్ అవుతుంది. బస్సులను బస్టాప్‌లోనే నిలిపితే సమస్య కొంత వరకు పరిష్కరించవచ్చు.

- పావని, పద్మారావునగర్

నేడు అర్వింద్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

సికింద్రాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారిగా అర్వింద్‌కుమార్ ద్వివేదీ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మూడేళ్లుగా కంటోన్మెంట్ సీఈఓగా ఉన్న మధుకర్ నాయక్‌ను ఇటీవల న్యూఢిల్లీలోని రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయానికి పదోన్నతిపై బదిలీ చేయడం, అక్కడ ఉన్న అర్వింద్‌కుమార్‌ను కంటోన్మెంట్ సీఈఓగా బదిలీ చేయడం తెలిసిందే. కాగా మధుకర్ నాయక్ నుంచి బుధవారం ద్వివేదీ బాధ్యతలు స్వీకరించనున్నారు.



మధుకర్ నాయక్, అర్వింద్‌కుమార్ ద్వివేదీలతో మాట్లాడుతున్న జంపన

● పదోన్నతితో బదిలీపై వెళుతున్న కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ సేవలను ప్రజలు మరువలేరని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో మధుకర్ నాయక్‌తోపాటు నూతన సీఈఓగా బాధ్యతలు స్వీకరించనున్న అర్వింద్‌కుమార్ ద్వివేదీ, డిఫెన్స్ ఎస్టేట్ అధికారి దినేష్‌రెడ్డిలను ఆయన కలిశారు. నూతన సీఈఓ ద్వివేదీకి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రకాష్ భాంటియా, షకీబ్ హుస్సేన్, రమేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం.. సీవీ రామన్ సైన్స్ సెంటర్

బోయినపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెరగాలంటే విద్యార్థులు ఏమి నేర్చుకున్నది తెలియాలంటే సైన్స్ ల్యాబ్‌లు ఉండాలి. అందుకని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల తలరాతలు మార్చేందుకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అక్షయ విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రెండు కోట్ల నిధులతో సికింద్రాబాద్ తాడ్‌బండ్‌లో నిరుపయోగంగా ఉన్న ఓ బంగ్లాను ముస్తాబు చేసి సీవీ రామన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తుంది. ఆరు నుంచి పదవ తరగతి చదువుతున్న పేద విద్యార్థులు తమ పాఠశాలలో ఏదైతే నేర్చుకున్నారో అదే విద్యార్థులు ఈ సీవీ రామన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ల్యాబ్‌కు వచ్చి పరీక్షలు చేసి తమలో ఉన్న నైపుణ్యాలు, ఆలోచనలను పెంచుకోవడానికి ఈ ల్యాబ్ ఎంతో ఉపయోగపడనుందని నిర్వాహకులు తెలుపుతున్నారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ల్యాబ్‌లు లేవు. అందుకే ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీవీ రామన్ సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని ప్రతిరోజు వంద మంది విద్యార్థులు ఈ ప్రయోగశాలలో ప్రయోగాలు చేసేవిధంగా ఈ ల్యాబ్ బుధవారం నుంచి అందుబాటులోకి రానున్నది. ఇక్కడ ప్రయోగాలు చేయడానికి 15 కిలో మీటర్ల వరకు చుట్టుపక్కల ఉన్న 17 పాఠశాలల నుంచి సుమారు 3500 మంది విద్యార్థులు ప్రయోగాలు చేసుకోవడానికి సర్వం సిద్ధమైంది. బుధవారం కంటోన్మెంట్ బ్రిగేడియర్ రాజీవ్, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌ల చేతుల మీదుగా ప్రారంభం కానున్నది.



ప్రారంభానికి సిద్ధమైన సీవీ రామన్ సైన్స్ సెంటర్

ఉచిత ఆర్టీసి బస్సులు

సీవీ రామన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ల్యాబ్‌కు వివిధ ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రావడానికి అప్పటి టీఎస్ ఆర్టీసి ఎండీ సజ్జనార్‌ను ఫౌండేషన్ సభ్యులు కలిశారు. సానుకూలంగా స్పందించి ఆయన యాత్రదాన్ పేరిట ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల రాకపోకలకు రెండు ప్రత్యేక బస్సులను కేటాయించారు. ఈ సంస్థకు సజ్జనార్ లక్ష రూపాయలు తన సొంత నిధులను అందజేశారు. ఈ ప్రత్యేక బస్సులు ఉదయం 9 గంటలకు ఒక బ్యాచ్‌ని ఇక్కడకు తీసుకువచ్చి తీసుకువెళ్లడానికి సిద్ధంగా ఉన్నాయి. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బస్సులు కేటాయించడం పట్ల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరిన్ని సేవలు అందిస్తాం



కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ సహకారంతో ఈ సీవీ రామన్ సైన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో ఈ లాంటి సైన్స్ అండ్ టెక్నాలజీ ల్యాబ్‌లను అందుబాటులోకి తెస్తాం. కంటోన్మెంట్‌లో 15 సెంటర్లలో సుమారు 600 విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

- ప్రసాద్, అక్షయ విద్య ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్

విద్యార్థులకు దిశా నిర్దేశం



చిట్టి చేతులతో చెమటోడ్చిన ఆ చిన్నారులు ఇప్పుడు పలకా బలపం పట్టి సాయంత్రం ఓ చోట చేరి అక్షరాలు దిద్దుతున్నారు. ఈ మార్పునకు కారణం అక్షయ విద్య ఫౌండేషన్‌నే. ఈ లాంటి ల్యాబ్‌ల వల్ల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంచి దిశ నిర్దేశం ఉంటుంది.

- కె. మురళీధర్, విశ్రాంత ఎస్ఓటీ డీసీపీ ఫౌండేషన్ అడ్వైజర్

దీపావళి అమావాస్య విశిష్టమైంది

బోయినపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని అందులోను దీపావళి అమావాస్య ఎంతో విశిష్టమైందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. మంగళవారం దీపావళి అమావాస్యను పురస్కరించుకుని బోయినపల్లి బాపూజీనగర్ నల్ల పోచమ్మ ఆలయంలో దాత మర్రి పుష్పాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగాణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రామారావు సరేందర్, అజిత్, పుట్టి నర్సింహ, ప్రేమ్ ముదిరాజ్, శ్రీకాంత్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వేడుక

బోయినపల్లి తార అనాథ ఆశ్రమంలోని పిల్లలతో కలిసి దీపావళిని జరుపుకుని, పిల్లలతో టపాసులు కాల్పించిన బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డీఐ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

- బోయినపల్లి, ఆంధ్రజ్యోతి



వరద బాధితులకు డ్రై కిట్స్ పంపిణీ

బౌద్ధనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఇబ్బందుల బారిన పడిన వరద బాధితులకు వారాసిగూడ బ్రాహ్మణబస్తీలో మంగళవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్సీ) ఆధ్వర్యంలో డ్రై కిట్స్‌ను పంపిణీ చేశారు. ఎనిమిది మంది కుటుంబాలకు డ్రై కిట్స్‌తో పాటు వివిధ రకాల వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో డీబీఆర్సీ సమన్వయకర్త నళిని, హైదరాబాద్ జిల్లా ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యురాలు పులి కల్పన, డీబీఎఫ్ శంకర్, రామచంద్రం పాల్గొన్నారు.



విద్యార్థులతో పోలీస్ సిబ్బంది

పోలీస్ అమర వీరుల దినోత్సవంపై అవగాహన

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మక్తాలోని ఇక్రా హైస్కూల్ విద్యార్థులు నెక్లెస్ రోడ్డులోని లేక్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా లేక్ ఇన్‌స్పెక్టర్ బుర్రా చిట్టి విద్యార్థులకు పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఎందుకు జరుపుకుంటారు, దాని ప్రాముఖ్యం గురించి వివరించారు. అలాగే పోలీసుల విధులు, బాధ్యతలు, డయల్ 100 సేవలు, మాదక ద్రవ్యాల వ్యతిరేక చర్యలు, సైబర్ భద్రతలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎసైలు బాల్‌రాజ్, శివ శంకర్, సతీష్, ప్రాశాంత్‌లతో పాటు ఇతర సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అట్టహాసంగా దీపావళి వేడుకలు

బౌద్ధనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో దీపావళి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ చైర్మన్ కొట్ట ధరణీధర్, ప్రధానార్చకులు శ్రీనివాసపంతులు అమ్మవారికి దర్శించుకుని పూజలు నిర్వహించారు. బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, నాయకులు బెజ్జంకి రాజేశ్, శైలేందర్ తదితరులు సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. వారాసిగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్, చిలకలగూడ తదితర ప్రాంతాల్లో పలువురు మహిళలు ఇళ్లలో బొమ్మల కొలువులు ఏర్పాటుచేసి లక్ష్మీదేవికి పూజలు చేశారు. వ్యాపారులు దుకాణాలను అరటిచెట్లు, వివిధ రకాలపూలతో అలంకరించారు.



మహాలక్ష్మీదేవి అలంకరణలో బౌద్ధనగర్ అమ్మవారు



పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయాలి

అడ్డగుట్ట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నవంబరు 23న మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య కోరారు. సోమవారం లాలాపేట వినోభానగర్‌కు వచ్చిన ఆయనకు మాలమహానాడు నాయకుడు బండి మహేశ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. దీపావళి పురస్కరించుకుని మాలల శ్మశానవాటికలో పూర్వీకుల సమాధుల వద్ద జరుగుతున్న పూజల్లో బస్తీవాసులతో కలిసి ఆయన పాల్గొన్నారు. 150 సంవత్సరాలుగా మాలల శ్మశానవాటికను కబ్జా చేయాటానికి కొందరు యత్నిస్తూ, అభివృద్ధిపనులను అడ్డుకుంటున్నారని, శ్మశానవాటికను కాపాడాలని ఆయనకు బస్తీవాసులు సూచించారు. అనంతరం రణభేరి మహాసభ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడురాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జైకుమార్, సికింద్రాబాద్ అధ్యక్షుడు నేతల రమేష్, నాయకులు రమాదేవి, పుష్ప, పద్మ, సత్యనారాయణ, రామచందర్, మల్లేష్, శ్రీనివాస్, బాలకృష్ణ, నవీన్, శేఖర్, సత్యనారాయణ, లక్ష్మణ్, కరుణా, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువతి ప్రాణాలు కాపాడిన లేక్ పోలీసులు

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యకు ప్రయత్నించిన యువతిని కాపాడిన ఘటన మంగళవారం లేక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. లేక్ ఇన్‌స్పెక్టర్ బుర్ర చిట్టి తెలిపిన వివరాల ప్రకారం నారాయణగూడలో ఇంటర్ చదువుతున్న 16 సంవత్సరాల యువతి చదువుపై శ్రద్ధలేక చదువుకోలేకపోతుంది. దీనితో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం బోట్స్ క్లబ్ వద్ద ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. దీనిని గమనించిన అటుగా వెళుతున్న వారు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించగా కానిస్టేబుళ్లు సందీప్, లావణ్యలు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని బాధిత యువతిని కాపాడి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. యువతికి ఇన్‌స్పెక్టర్ విద్య, జీవితంపై అవగాహన కల్పిస్తూ మానసికంగా దృఢంగా ఉండాలని కౌన్సిలింగ్ ఇచ్చి తల్లికి అప్పగించారు.



బాధితురాలికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కంటోన్మెంట్ అభివృద్ధికి రూ.303 కోట్లు

● నిధుల వినియోగంపై ప్రస్తుత, నూతన సీఈఓలతో ఎమ్మెల్యే సమావేశం ● డ్రైనేజీలు, నాలాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

సికింద్రాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ రహదారుల మీదుగా నాగపూర్ జాతీయ రహదారిపై సుచిత్ర వరకు, కరీంనగర్ హైవేపై తూముకుంట వరకు ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం, ఇందుకు అవసరమైన రక్షణ శాఖ స్థలాలను, కంటోన్మెంట్ బోర్డు స్థలాలను కేటాయించడానికి కేంద్రం అంగీకరించడం, కంటోన్మెంట్ భూములకు పరిహారంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.303 కోట్లు చెల్లిస్తున్న సంగతి విదితమే. అయితే ఈ పరిహార మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వ ఖాతాకు మళ్లించకుండా, స్థానికంగా కంటోన్మెంట్ అభివృద్ధికే ఖర్చు పెట్టాలని కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ రక్షణ శాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ఇదే అభ్యర్థన చేయడంతో కేంద్రం అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ మొత్తంతో కంటోన్మెంట్‌లో డ్రైనేజీలు, నాలాల అభివృద్ధి పనులు ఎలా చేపట్టాలి, ఏయే సమస్యలు పరిష్కరించాలనే అంశమై కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రస్తుత సీఈఓ డి.మధుకర్ నాయక్, కొత్త సీఈఓగా బాధ్యతలు స్వీకరించనున్న అర్వింద్‌కుమార్ ద్వివేదీలతో కూలంకషంగా చర్చించారు. కంటోన్మెంట్ సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కంటోన్మెంట్ ప్రజల కష్టాలు తీర్చాలని శ్రీగణేష్ విజ్ఞప్తి చేశారు.

● బుధవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కంటోన్మెంట్ బోర్డు అధికారులు, హెచ్ఎండీఏ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించనున్నారు. కంటోన్మెంట్‌లోని కాలనీలు, బస్తీలు వరద ముంపుకు గురి కాకుండా, డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించనున్నారు. కాగా ప్రజలు, మేధావులు తమ ప్రాంతాల్లో చేపట్టే నాలాలు, డ్రైనేజీల నిర్మాణానికి సంబంధించిన సూచనలు, సలహాలను వినతి పత్రాల రూపంలో ఇవ్వవలసిందిగా ఆయన కోరారు.

● డిఫెన్స్ ఎస్టేట్ అధికారి దినేష్‌రెడ్డితో శాసనసభ్యుడు శ్రీగణేష్ సమావేశమయ్యారు. తిరుమలగిరిలోని బి-3 కేటగిరీకి చెందిన 4.71 ఎకరాల స్థలాన్ని క్రిస్టియన్ సిమెట్రీకి కేటాయించాలని, ఈ భూమితోపాటు చుట్టుపక్కల ఇంకేమైనా భూమి ఉంటే అప్పగించాలని కోరారు. అవసరమైతే సీఎం దృష్టికి తీసుకువెళతానని, భూ బదలాయింపు విధానంలోనైనా ఈ కేటాయింపులు చేయవచ్చని పేర్కొన్నారు.



సీఈఓ మధుకర్ నాయక్, నూతన సీఈఓ అర్వింద్‌కుమార్ ద్వివేదిలతో సమావేశమైన శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్